www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 25 మార్చి 2025



మెగా డిఎస్‌సి-2025కు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం, బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డిఎస్‌సి-2025 పరీక్షకు టెట్‌లో అర్హత సాధించిన బిసి, ఇడబ్ల్యూఎస్ (ఇబిసి) అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ డిఎస్‌సి శిక్షణకు జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్‌వి.నాగరాణి తెలిపారు.

పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, టిటిసి, బిఎడ్, కుల, ఆదాయ నివాస ధ్రువపత్రాలు, ఆధార్ కార్డ్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జిరాక్స్ కాపీలు జత చేయాలని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను అభ్యర్థులు స్వయంగా జిల్లా బిసి సంక్షేమం, సాధికారిత అధికారి, కలెక్టరేట్ కాంపౌండ్, ఏలూరు వారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశాన్ని ఏలూరు జిల్లా అభ్యర్థులు ఉపయోగించుకోవాలని బిసి స్టడీ సర్కిల్, ఏలూరు సంచాలకులు తెలిపారు.

మునుగుతున్నా ముంపులో లేవంట..


సిపిఎం ఆధ్వర్యాన పోలవరం నిర్వాసితుల ఆందోళన

దద్దరిల్లిన ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణం

ముంపు గ్రామాలను 45.75 కాంటూరులో చేర్చడం దారుణం

18 ఏళ్లు నిండిన యువతకు జిల్లాకో విధంగా కటాఫ్ తేదీ న్యాయమా?

మండలం యూనిట్‌గా పరిహారం చెల్లించాలని డిమాండ్



వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

ప్రతియేటా గోదావరి వరదలకు మా గ్రామాలు మునిగిపోతున్నాయి.. కొండగుట్టలపై చేరి నరకం అనుభవిస్తున్నాం. అధికారులంతా ప్రత్యక్షంగా ఇక్కడ పరిస్థితులు చూస్తున్నా ముంపులో లేవంటున్నారు. మా గ్రామాలు 45.75 కాంటూరులో ఉన్నాయంటూ పరిహారంగాని, భూమికి భూమిగాని ఏఒక్కటీ ఇవ్వడం లేదు. తాము చేసిన తప్పేంటీ' అని ఏలూరు కలెక్టరేట్ వద్ద వందలాది మంది పోలవరం నిర్వాసితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన మద్రిపాడు, ఆంబోతులగూడెం, యల్లప్పగూడెం కొత్తూరు, మాధవరం, శుద్ధగుంప, వసంతవాడ వంటి పలు గ్రామాలకు చెందిన వందలాది మంది నిర్వాసితులు వంద కిలోమీటర్లకుపైగా తరలొచ్చి కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులకు వినతులిచ్చారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని, మండలం యూనిట్‌గా గుర్తించి అందరికీ పరిహారం ఇవ్వాలని, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరికీ పరిహారం అందించాలని నిర్వాసితులంతా పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులను రోజురోజుకీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. మొదటి కాంటూరు అని చెబుతూ గొమ్ముగూడెం, కుక్కునూరు ఎ-బ్లాక్, కివ్వాక, చీరవల్లి, దామరచర్ల, గుంపెనపల్లి, బోనగిరి, సీతారామపురం తదితర గ్రామాలకు కోసం గతంలో నిర్వహించిన వ్యక్తిగత ప్యాకేజీ రూ. 6,36,000 నిర్వాసితుల ఖాతాల్లో జమ చేశారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కాంటూర్ లెక్కలు తప్పని 2022 గోదావరి వరదలు తేల్చాయన్నారు. ఏళ్లు గడుస్తుంటే జనాభా పెరుగుతూ, వయస్సు పెరగడంతో 18 ఏళ్ల దాటినవారి సంఖ్య పెరిగిందన్నారు. బాధితుల సంఖ్యను తగ్గించడం అమానుషత్వమేనన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు కటాఫ్ తేదీ 2022 అక్టోబర్ ఏడో తేదీగా నిర్ణయించి, ఈ జిల్లాకు 2017గా నిర్ణయించడం అన్యాయమని అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంటూర్‌తో సంబంధం లేకుండా పరిహారం ఇస్తామని చెప్పి తొలుత తరలించే గ్రామాలకే పరిహారం చెల్లించడం దుర్మార్గమన్నారు. కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లించాలన్నారు. 18 ఏళ్ళ నిండిన యువతీ యువకులకు భూమికి భూమి చేయించి రోజుకో ప్రాతిపదికన జాబితాలోకి తీసుకుని పరిహారం చెల్లించాలని, తాతలు, తండ్రుల పేరు మీద వచ్చిన పరిహారం వారి వారసులకు ఇవ్వాలన్నారు. గతంలో రూ.1.15 లక్షలు ఇచ్చిన భూములకు రూ.ఐదు లక్షలు, గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ.పది లక్షల హామీని ఈ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. వెంకటాపురం నుంచి కుడుములపాడు వరకు రోడ్డును వెంటనే పూర్తి చేయాలని, మండలంలోని ప్రతి గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కుక్కునూరు మండల కేంద్రంలో సామూహిక బహిరంగ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా పునరావాస పరిహారం పెంచాలని, ప్రతి నిర్వాసితునికీ రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న పోడు భూములను సర్వే చేసి ప్రతి ఎకరాకూ పరిహారం చెల్లించాలని, ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఉద్యోగం ఇవ్వాలని, పునరావాస కాలనీల్లో 25 రకాల మౌలిక వసతులు కల్పించాలన్నారు. వివాహమైన ఆడపిల్లలకు పునరావాస పరిహారం చెల్లించాలన్నారు. ముంపు మండలాల సిపిఎం నాయకులు వై.నాగేంద్రరావు, ధర్మల రమేష్, మడివి దుర్గారావు ఇతర నాయకులు నిర్వాసిత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.లింగరాజు, పి.రామకృష్ణ, వెంకట్రావు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం వద్ద 45 అడుగులకు వరదొస్తే మా గ్రామం ముంపులోకి

తురసం రాముడు, ఆంబోతులవారిగూడెం, కుక్కునూరు మండలం



మా గ్రామంలో 83 కుటుంబాలు ఉన్నాయి. భద్రాచలం వద్ద 45 అడుగుల వరద నీరు చేరితే మా గ్రామం మునిగిపోతుంది. అలాంటి మా గ్రామాన్ని 45.75 కాంటూరులో చేర్చారు. దీంతో పునరావాస ప్యాకేజీగాని, భూమికిభూమిగాని ఏఒక్కటీ మా గ్రామానికి ఇవ్వలేదు. ప్రాజెక్టు పూర్తయితే మా పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు.

ప్రతియేటా ఇళ్లు దెబ్బతినడం, బాగు చేయించడంతోనే సరిపోతుంది

మేడిపల్లి బాబు, మాధవరం, కుక్కునూరు మండలం



మా గ్రామంలో 500 కుటుంబాలు ఉన్నాయి. ప్రతియేటా గోదావరి వరదలకు ఇళ్లన్నీ మునిగిపోతున్నాయి. వరద తగ్గిన తర్వాత రూ.వేలకు వేలు ఖర్చుపెట్టి ఇళ్లు బాగు చేయించుకోవాల్సి వస్తోంది. అయినప్పటికీ మా గ్రామం 45.75 కాంటూరులో చేర్చి పరిహారం ఇవ్వలేదు. మా గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చి పరిహారం ఇవ్వాలి. లేకపోతే మా పరిస్థితి అత్యంత దారుణంగా మారుతుంది.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి

రైతులకు లాభసాటిగా మామిడి పరిశోధనలు

మామిడి నాణ్యత పెంచితే ఎయిర్ కార్గో సేవలు అందుబాటులోకి

రూ.30 కోట్లతో నూజివీడు మార్కెట్ యార్డు అభివృద్ధి

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మామిడి రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని, నూజివీడు మామిడికి మరింత ఇమేజ్ తెచ్చి రవాణా సౌకర్యాలు మెరుగుపర్చేందుకు నూజివీడు మార్కెట్ యార్డును రూ.30 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. నూజివీడు మామిడి పరిశోధన కిసాన్ మేళా వర్క్‌షాప్ స్థానిక నాగేంద్ర వరలక్ష్మి కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి మంత్రి కొలుసు పార్థసారధి తొలుత స్టాల్స్ సందర్శించారు. అనంతరం రైతులు, వ్యాపారులు, అధికారులనుద్దేశించి మాట్లాడారు. నూజివీడు మామిడికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇటీవల నాణ్యమైన మామిడి దిగుబడి రాకపోవడంతో రైతులు ఆర్థికంగా ఎంతగానో నష్టపోతున్నారన్నారు. గత ప్రభుత్వం విస్మరించిన మామిడి పంటకు బీమా పథకాన్ని త్వరలో అమలు చేస్తామని మంత్రి చెప్పారు. నూజివీడు మామిడి ఇమేజ్ మరింత పెంచేందుకు నాణ్యమైన మామిడి పంటకు రైతులు కృషి చేయాలని కోరారు. మార్కెట్ యార్డులో వివిధ మౌలిక సదుపాయాలను రూ.30 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నామని, వీటిని వినియోగించుకుని నాణ్యమైన మామిడి దిగుబడి అందించాలని అన్నారు. నాణ్యమైన మామిడి దిగుబడికి తీసుకోవాల్సిన చర్యలు, రైతులకు అవగాహన కల్పించేందుకు ఉద్యాన, మార్కెటింగ్, మామిడి పరిశోధనా శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి కమిటీ నియమించి, మామిడి పంటకు అనుకూలమైన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సూచనలు అందించాలన్నారు. తద్వారా నూజివీడు మామిడికి పూర్వవైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన మామిడిని విదేశాలకు ఎగుమతి చేసేందుకు అవసరమైన ఎయిర్ కార్గో సేవలను కూడా రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. మామిడి రైతుల లాభాలు పెంచడానికి ఉపయోగపడేలా పరిశోధనలు ఉండాలని మంత్రి అన్నారు, ఎరువుల వాడకం మాని సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని అన్నారు. మామిడి పరిశోధనా కేంద్రంలో అవసరమైన సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించాలని సూచించారు. మామిడితోపాటు అంతర పంటను వేస్తే లాభసాటిగా ఉంటుందన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, దాన్ని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. వచ్చే ఏడాది కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటు చేస్తామన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు రావాల్సి ఉందని, వాటిని సాధించి త్వరలోనే ప్రాజెక్ట్ పనులను పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను, ఫుడ్‌పార్క్‌ను నూజివీడు ప్రాంతంలో ఏర్పాటు చేస్తామన్నారు.

కుంకాల ఆనకట్ట ఎత్తు పెంచి సాగునీరివ్వాలి

సిపిఎం ప్రజాచైతన్య యాత్రలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి



ప్రజా చైతన్య యాత్రలో నినదిస్తున్న నేతలు

ప్రజాశక్తి - పోలవరం

కుంకాల ఆనకట్ట ఎత్తు పెంచి రైతులకు సాగునీరు అందించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి అన్నారు. సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్యయాత్ర రెండో రోజు సోమవారం మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ మండలంలోని రెడ్డికుంకాల సమీపంలో నిర్మించిన ఆనకట్టలో పూడిక తీయాలన్నారు. ఆనకట్ట ఎత్తు పెంచి రైతులందరికీ సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పేద్రాల నుంచి ఎల్ఎన్‌డి పేట వరకు ఉన్న మార్గంలో కొండవాగులపై కల్వర్టు లేక ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే కొండవాగులపై కల్వర్టులను నిర్మించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ వింజరం గ్రామంలో 1989లో నిర్మించిన రేషన్ డిపో కేంద్రం పూర్తిగా పాడైపోయిందన్నారు. జిసిసి గొడౌన్ స్థలమున్నా ప్రభుత్వం ఇప్పటికీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిధులు కేటాయించి కొత్త భవనం నిర్మించి రేషన్ లబ్ధిదారులకు బియ్యం సరఫరా చేయాలన్నారు. కోయ నాగంపాలెంలో విద్యార్థులు లేరని బడి మూసివేశారని, ప్రస్తుతం 10 మంది రెండు కిలోమీటర్లు దూరం మణుగోపాల బడికి నడిచి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రభుత్వ బడిని కొనసాగించాలని కోరారు. యాత్రలో సిపిఎం నాయకులు పోలోజు నాగేశ్వరరావు, బొరగం భూచంద్రరావు, చంద్రు బుల్లెమ్మ, ఎస్.సాయికృష్ణ, కె.భీమరాజు, శివ రమేష్, అనూష తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా




ఆగిరిపల్లిలో ధర్నా

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు డిమాండ్ చేశారు. ప్రజాచైతన్య యాత్రలో వచ్చిన సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని, అర్హులందరికీ రేషన్ కార్డులు, నివేశన స్థలాలు మంజూరు చేయాలని, ఉపాధి కూలీల పని దినాలను 200 రోజులకు పెంచడంతోపాటు కనీస వేతనం రోజుకి రూ.600 ఇవ్వాలని, ఉపాధి హామీ కూలీలకు బకాయిలను వెంటనే విడుదల చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, షేక్ జహాంగీర్‌భాషా, ముత్యాల నరేష్, నైనవరపు ఊళక్కయ్య, తాడి అర్జునరావు, జంగం అంజయ్య, జంగం సుబ్బారావు, మరియమ్మ, మల్లేశ్వరి, కుమారి పాల్గొన్నారు.

కోకో గింజలు ప్రభుత్వం కొనుగోలు చేయాలి

కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద రైతుల ధర్నా



ముసునూరులో...



పెదవేగిలో..

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కోకో గింజల కొనుగోళ్లను కంపెనీలు నిలిపివేయడం వల్ల కోకో తీవ్రంగా నష్టపోతున్నామని కోకో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏలూరు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. కోకో గింజలను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలంటూ కోకో రైతులు నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. గత నెల రోజులుగా కోకో రైతులు కోకో గింజల కొనుగోలు, ధర సమస్యలపై రోడ్లెక్కి ఆందోళన చేస్తున్నారని చెప్పారు. అన్ సీజన్ కోకో గింజలు కొనుగోలు చేయకపోవడం అన్యాయమన్నారు. కోకో తోటలు కౌలుకు తీసుకున్న కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తగిన పరిష్కారం చూపకుండా మరింత ఆలస్యం చేస్తే కోకో రైతులు మరింతగా నష్టపోతారని చెప్పారు. ప్రభుత్వమే రంగంలోకి దిగి కోకో రైతుల వద్ద ఉన్న కోకో గింజలను వెంటనే కొనుగోలు చేయాలని, ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపుదల చేయాలని కోరారు. కోకో గింజలకు కనీస మద్దతు ధర ప్రకటించాలన్నారు. ఉద్యాన శాఖ నుంచి రావాల్సిన సబ్సిడీ బకాయిలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కొబ్బరి రైతు సంఘం ఉపాధ్యక్షులు మున్నంగి సుబ్బారెడ్డి, పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం పరిధి ఆయిల్ పామ్ రైతు సంఘం అధ్యక్షులు ఉండవల్లి వెంకట్రావు, కోకో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గుడిబండి వీర రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కోనేరు సతీష్ బాబు, వివిధ మండలాల కోకో రైతులు పాల్గొన్నారు.

పెదవేగి : కోకో రైతుల వద్ద ఉన్న అన్ సీజన్ కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం కోకో రైతులు ధర్నా నిర్వహించారు. కోకో రైతులను ప్రభుత్వం ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ ధర్నాకు కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆయిల్ పామ్ రైతు సంఘం అధ్యక్షులు ఉండవల్లి వెంకట్రావు, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షులు మున్నంగి సుబ్బారెడ్డి మాట్లాడారు. ఈ సంవత్సరం కోకో రైతులకు తగిన ధర రాక, కంపెనీలు గింజలు కొనుగోలు చేయక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క పెదవేగి మండలంలోనే అన్ సీజన్ కోకో గింజలు 500 టన్నులకు పైగా రైతుల వద్ద నిల్వ ఉండిపోయాయని చెప్పారు. అనంతరం తహశీల్దార్ భ్రమరాంబకు, మండల ఉద్యాన శాఖాధికారికి వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కోకో రైతుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గుడిబండి వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కోనేరు సతీష-బాబు, కోకో రైతులు బొప్పన పూర్ణచంద్రరావు, ఆర్.తేజకృష్ణ, జగన్మోహన్‌రావు, వై.లలితాకుమార్, కె.రామిరెడ్డి, జి.లక్ష్మణరావు, పి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

ముసునూరు : కోకో పంట గింజలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం నాయకులు రాధాకృష్ణ కోరారు. ఈ మేరకు కోకో పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ తహశీల్దార్ రాజ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

నేడు, రేపు జిల్లా కలెక్టర్ల సదస్సు

జిల్లాలోని సమస్యలపై నివేదికలు రూపొందించిన ఇద్దరు కలెక్టర్లు

సమస్యల పరిష్కారానికి మోక్షం లభించేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాజధానిలో మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ల సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హాజరు కానున్నారు. ఇప్పటికే ఇద్దరు కలెక్టర్లు జిల్లాలోని ప్రధాన సమస్యలపై నివేదిక తయారు చేసుకున్నారు. జిల్లాలవారీగా ప్రజెంటేషన్ ఇచ్చే సమయంలో జిల్లాలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి మోక్షం లభించేలా మాట్లాడాలని జిల్లావాసులు కోరుకుంటున్నారు. ఏలూరు జిల్లా పరిధిలో ప్రధానంగా పోలవరం నిర్వాసితుల సమస్య పరిష్కరించాల్సి ఉంది. చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాలు పూర్తి చేయాల్సి ఉంది. కొల్లేరు సమస్య తీవ్రరూపం దాల్చడంతో దీన్ని ప్రధాన సమస్యగా జిల్లా కలెక్టర్ల సమావేశంలో చర్చించాల్సిన ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయి. కొల్లేరు రెగ్యులేటర్ నిర్మాణంపై, జిల్లాలో తాగునీటి సమస్యపైన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది. రెవెన్యూ సమస్యలు అనేకం ఇప్పటికీ పరిష్కారం కాకుండా ఉన్నాయి. అదేవిధంగా జిల్లాలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, కోకో, మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపైన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది. కౌలు రైతులకు బ్యాంకు రుణాల సమస్యకు సంబంధించిన ఇబ్బందులను సిఎం దృష్టికి తీసుకెళ్లాలని అంతా కోరుతున్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి తెలపాల్సి ఉంది. సంక్షేమ పథకాలు అమలు కాకపోవటంతో జనాల నుంచి వస్తున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది. పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణం, మధ్యలోనే ఆగిపోయిన అంగన్వాడీ, వివిధ ప్రభుత్వ భవనాలకు సంబంధించి మాట్లాడాల్సి ఉంది. ఏలూరు బోధనా ఆస్పత్రిలో డాక్టర్ల సమస్య, ఇబ్బందులపై సదస్సులో లేవనెత్తాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ప్రధానంగా కాలుష్యం సమస్య ఎక్కువగా ఉంది. పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యంతో జనాలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్నారు. కేన్సర్ వంటి రోగాలు భారీగా పెరుగుతున్నాయి. కాలుష్యం అరికట్టడంపై పశ్చిమ కలెక్టర్ గట్టి చర్యలు ప్రతిపాదించాల్సి ఉంది. డెల్టా ఆధునికీకరణ గురించి, ఇటీవల కాలంలో మేత, మందుల ధరలు పెరిగిపోయి ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరలు అమాంతం తగ్గిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి శాశ్వత పరిష్కారంపై సదస్సులో కలెక్టర్ మాట్లాడాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరని పరిస్థితి ఉంది. త్వరితగతిన వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు సంబంధించి సిఎం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది. అలాగే నరసాపురంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు గురించి మాట్లాడాల్సిన ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు, జిల్లా ఆస్పత్రికి సంబంధించి వెంటనే తీసుకోవాల్సిన చర్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది. కేన్సర్ రోగులకు పింఛను ఇచ్చే అంశంపై కలెక్టర్లు ఇద్దరు సిఎం ఎదుట ప్రతిపాదించాల్సి ఉంది. జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరిగే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లు మాట్లాడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

సురేష్ బహుగుణ పాఠశాలకు కంప్యూటర్లు బహూకరణ

గుప్తా ఫౌండేషన్‌ను అభినందించిన జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సురేష్ బహుగుణ పోలీసు పాఠశాలకు కెకె.గుప్తా ఫౌండేషన్ ద్వారా ఎనిమిది కంప్యూటర్లు బహూకరించారని, వారి ఉదారతకు అభినందనలు తెలియజేస్తున్నామని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీసు శాఖ నిర్వహిస్తున్న సురేష్ బహుగుణ పాఠశాలకు ప్రముఖ వ్యాపారవేత్త కెకె.గుప్తా ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో ఎనిమిది కంప్యూటర్లను ఈ పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ ఎంతోమందికి సహాయ సహకారాలు అందించిన పేరు గుప్తా ఫౌండేషన్ అధినేత కెకె.గుప్తా పాఠశాలకు కంప్యూటర్లు బహూకరించడం సంతోషంగా ఉందని అభినందించారు. విద్యార్థులకు ఈ కంప్యూటర్‌లో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్‌తోపాటు గుప్తా ఫౌండేషన్ అధినేత కెకె.గుప్తా, ఆయన తనయుడు పవన్ కుమార్, ఆర్ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి ప్రతాప్‌శివ కిషోర్

ట్రిపుల్ ఐటీ విద్యార్థులపై కోతుల దాడి



చికిత్స పొందుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిధిలోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో రోజురోజుకీ కోతుల బెడద పెరిగిపోతోందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల క్యాంపస్‌లో సోమవారం రాత్రి ఇద్దరు విద్యార్థులపై కోతులు దాడి చేయడంతో గాయాల పాలయ్యారు. గాయపడిన విద్యార్థులు నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఇప్పటికైనా కళాశాల యాజమాన్యం స్పందించి రోజురోజుకీ పెరిగిపోతున్న కోతుల గుంపులను అటవీ ప్రాంతానికి తరలించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

డంపింగ్ యార్డులో చెత్తను తగలపెట్టొద్దు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


డంపింగ్‌యార్డులో చెత్తకు నిప్పు

స్థానిక మున్సిపల్ డంపింగ్ యార్డులో చెత్త తగలపెట్టొద్దని సిపిఎం పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చెత్త తగలపెట్టొద్దని వివిధ సంఘాలు, పత్రికలు పలుమార్లు మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తులు చేసినా వారు పట్టించుకోవడం లేదని తెలిపారు. దీంతో పట్టణంలో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా పర్యావరణ పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

భూ రికార్డులు తారుమారు చేయొద్దు

తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన ఆదివాసీలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

1/70 యాక్ట్ భూముల రికార్డులు తారుమారు చేస్తున్నారని ఎఐకెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ అన్నారు. వెలుతురువారిగూడెం, వాడపల్లికాలనీల ఆదివాసీలు అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఇప్పటివరకు మూడుసార్లు మండల రెవెన్యూ అధికారులు ఆదివాసీల రికార్డులను తారుమారు చేస్తూ వచ్చారన్నారు. ఆదివాసీ, 1/70 చట్టాలను రెవెన్యూ అధికారులు పరిగణలోకి తీసుకోకుండా గిరిజనేతరులకు, భూస్వాములకు అనుకూలంగా పనిచేస్తున్నారన్నారు. ఇకపై రికార్డులు ఏమాత్రం తారుమారు జరిగిన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారం రాఘవ, తగరం బాబూరావు పాల్గొన్నారు.

అత్యాచారాల నిరోధక చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఎసి) ఎం.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సోమవారం కలపర్రు గ్రామంలోని జెడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు బాల బాలికలపై అత్యాచారాల నిరోధక చట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులతో పాటు సంబంధిత అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి సమస్య అయినా జిల్లా న్యాయసేవాధికారి దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రచన, తణుకు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.వి.నాగరంజిత్‌కుమార్, జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి రాజరాజేశ్వరి తేజస్వి, పాలకొల్లు అదనపు జూనియర్ సివిల్ జడ్జి వివిఎస్ఎన్.లక్ష్మీలావణ్య, ఎఎల్ఎస్ కో-ఆర్డినేటర్ రాధాకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమయ్య పాల్గొన్నారు.

పంటరుణాలు అందించేందుకు కృషి

ప్రజాశక్తి - టి.నరసాపురం

సహకార సంఘ రైతులకు పంట రుణాలు సకాలంలో అందించేందుకు కృషి చేస్తామని మధ్యాహ్నపువారిగూడెం సహకార సంఘ అఫిషియల్ చైర్ పర్సన్ వై.ఏసుకుమార్ తెలిపారు. స్థానిక సంఘ ఆవరణలో సోమవారం ఏసుకుమార్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సమావేశంలో పంటరుణాలు ఆలస్యమవుతున్నాయని రైతులు కోరడంతో స్పందించిన చైర్‌పర్సన్ ఏసుకుమార్ మాట్లాడుతూ పంట రుణాలు విషయం ఉన్నతాధికారులతో చర్చించి సకాలంలో అందేలా చూస్తామని తెలిపారు. అదేవిధంగా రైతులు తీసుకున్న రుణాలు కూడా సకాలంలో చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సిఇఒ జి.భుజంగరావు, రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కరాటేతో క్రమశిక్షణ

ప్రజాశక్తి - భీమడోలు

కరాటే క్రమశిక్షణ అలవరుస్తుందని, ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర వహిస్తుందని, ముఖ్యంగా మహిళల్లో ఆత్మ రక్షణకు సహకరిస్తుందని భీమడోలు ఎస్ఐ సుధాకర్ అన్నారు. భీమడోలు శ్రీ మాధురి జూనియర్ కళాశాలలో సోమవారం కరాటే బెల్ట్ టెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జపాన్ షాట్ కాన్ కరాటే పోటీలకు ఇండియా ఆర్గనైజర్ డిఎల్.నారాయణ పర్యవేక్షణలో శిక్షణ పొందిన 14 మంది విద్యార్థులు కరాటే పోటీల్లో పాల్గొన్నారు. వీరికి శిక్షకులుగా సత్యనారాయణ వ్యవహరించారు. పోటీల్లో బ్లాక్ బెల్ట్ విజేతగా కామన సాయిబాబా నిలిచారు. వీరికి ఎస్ఐ నిర్వాహకుల తరపున బ్లాక్ బెల్ట్, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బాలు పాల్గొన్నారు.

కృష్ణప్రియకు పిహెచ్‌డి డిగ్రీ ప్రదానం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని పోతవరప్పాడు ఎన్ఆర్ఐ కళాశాలలో బేసిక్ సైన్సెస్, హ్యూమానిటీస్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కృష్ణప్రియకు నాగార్జున యూనివర్శిటీ వారు పిహెచ్‌డి డిగ్రీ ప్రదానం చేసినట్లు కళాశాల ఛైర్మన్ రావి వెంకట్రావు తెలిపారు. నాగార్జున యూనివర్శిటీ ఫిజిక్స్ విభాగం ఆచార్యులు డాక్టర్ వి.అరుణ పర్యవేక్షణలో ఒక అంశంపై పరిశోధనలు చేసినందుకు ఆమెకు పిహెచ్‌డి పట్టాను అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణప్రియను ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కరరావు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ జి.రోషయ్య, పలు విభాగాధిపతులు అభినందించారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

ప్రజాశక్తి - దెందులూరు

స్థానిక ఏలూరు దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం ద్వారా అవసరమైన వికలాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీని సోమవారం చేపట్టారు. మొదటగా సంస్థ కో-ఆర్డినేటర్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వికలాంగుల పునరావాస కేంద్రం ఉండడం చాల అవసరమన్నారు. ఈ కేంద్రం ద్వారా వికలాంగులకు అవయవాలు -681, ఫిజియో థెరపీ -782, స్పీచ్ థెరపీ-256 యుడిఐడి సేవలు అందించినట్లు చెప్పారు. వివరాల కోసం 08812-249297,7386565469 సంప్రదించాలన్నారు.

ఉపాధి హామీ కూలీలకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఉపాధి హామీ చట్టం కూలీలకు బకాయిలను వెంటనే విడుదల చేయాలని బొర్రంపాలెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గుండె పాండురంగ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీలకు జనవరి రెండో వారం నుంచి ఇప్పటివరకు చేసిన పనికి డబ్బులు జమకాలేదన్నారు. ఈ వారంతో ఆర్థిక సంవత్సరం పూర్తవుతుందని, వంద రోజుల పనిదినాలు పూర్తికానివారు మండలంలో వేల సంఖ్యలో ఉన్నారని, ఏప్రిల్ నుంచి అందరికీ మళ్లీ వందరోజుల పని దినాలు మొదలవుతాయని, వారికి మిగిలిన పని దినాలను సకాలంలో కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. వెంటనే ఉపాధి కూలీలకు పనిని కల్పించి, ఇప్పటి వరకు ఉన్న వారి బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

నేరాలు - ఘోరాలు

మద్యం సీసాల అపహరణ : నలుగురికి జైలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న వాచ్‌మెన్‌ను కట్టేసి అతనిపై దాడి చేసి దుకాణంలో ఉన్న మద్యం బాటిల్లను అపహరించకపోయిన ఘటనలో నలుగురు నిందితులకు ఒక్కొక్కరికి నాలుగేళ్ల జైలు, రూ.1500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి రాజేశ్వరి తీర్పునిచ్చారు. వివరాల ప్రకారం... 2002లో ధర్మాజీగూడెం ప్రాంతంలో ప్రభుత్వ మద్యం దుకాణం మూసివేసిన తర్వాత అర్ధరాత్రి సమయంలో పెదపాడు మండలం అప్పనవీడు ప్రాంతానికి చెందిన బోయిన శ్రీసూర్య, అదే మండలం తాళ్లమూడి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి గోపీ, అదే ప్రాంతానికి చెందిన కోట శ్యామ్‌కుమార్, తాళ్లమూడి ప్రాంతానికి చెందిన కంభం అరవింద్ అనే నలుగురు వ్యక్తులు అక్కడకు వెళ్లి వాచ్‌మెన్‌పై దాడికి పాల్పడ్డారు. అనంతరం అతని కట్టివేసి మద్యం దుకాణంలో ఉన్న మద్యం సీసాలను అపహరించుకుపోయారు. దీనిపై అప్పటి ధర్మాజీగూడెం ఎస్ఐ చెన్నారావు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ధర్మాజీగూడెం ఎస్ఐగా పనిచేస్తున్న ఖడ్గ వెంకన్న ఈ కేసులో నిందితులకు శిక్ష పడే విధంగా కోర్టులో ఆధారాలు సమర్పించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన తర్వాత సోమవారం ఐదో అదనపు జిల్లా సెషన్స్ మ్యాజిస్ట్రేట్ రాజేశ్వరి తీర్పునిచ్చారు. నిందితులకు జైలు, జరిమానా విధించారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

నూజివీడు మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మంత్రి పార్థసారథి

రూ.10.57 కోట్ల మిగులుతో బడ్జెట్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్


మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అధికారులను ఆదేశించారు. రూ.10.57 కోట్ల మిగులుతో నూజివీడు మున్సిపల్ బడ్జెట్ ఆమోదిస్తూ కౌన్సిల్ తీర్మానించింది. నూజివీడు పట్టణ పరిధిలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ వివిధ ప్రతిపాదనలు, అంచనాలతో రూపొందించిన రూ.10.57 కోట్ల మిగులుతో బడ్జెట్‌ను ఆమోదించింది. బడ్జెట్ సమావేశానికి ఎక్స్ అఫిషియో హోదాలో మంత్రి పార్థసారధి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణ కోసం అవసరమైన నిధులను విడుదల చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, కౌన్సిలర్ కొమ్మని విజయ నూజివీడు పట్టణంలో నెలకొన్న తాగునీటి ఎద్దడి, పారిశుధ్య పరిస్థితులు తదితరాలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి పార్థసారధి స్పందిస్తూ పట్టణంలో తాగునీటి ఎద్దడి లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులకు యూనిఫాంలు సరఫరా, వ్యక్తిగత అవసరాలు తీర్చేందుకు కావాల్సిన వస్తువులను తక్షణం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దాళ్వా ధాన్యం కొనుగోలుకు 118 కేంద్రాలు

జెసి పి.ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు


మాట్లాడుతున్న జెసి ధాత్రిరెడ్డి

జిల్లాలో 2024-25 రబీ ధాన్యం కొనుగోలుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో రబీ ధాన్యం సేకరణపై జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధ్యక్షతన జిల్లా ప్రొక్యూర్మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో రబీ పంటకు సంబంధించి 98 శాతం ఇకెవైసి పూర్తయిందన్నారు. జిల్లాలో 3,97,807 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పాదక కాగలదని అంచనా వేసి 2.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం లక్ష్యంగా అంచనా వేశామన్నారు. జిల్లాలో వరి సాగు చేస్తున్న రైతు, కౌలు రైతుల పేర్లను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించేందుకు కావాల్సిన గోనె సంచులను రైస్‌మిల్లర్లు ముందస్తుగానే పరిశీలించి మంచి స్థితిలోని గోనె సంచులను ముందుగానే నిర్దేశించిన గొడౌన్లలో ఉంచేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. త్వరితగతిన రవాణాకు వాహనాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలపై, ప్రభుత్వం రైతులకు కల్పించే సౌకర్యాలపై చెల్లించే ఖర్చు వంటి విషయాలను రైతులకు గ్రామసభల ద్వారా, కరపత్రాలు, బ్యానర్లు ద్వారా పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం రాగలదని అంచనా వేశా మన్నారు. సమావేశంలో ఆన్‌లైన్ ద్వారా నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒలు అచ్యుత్ అంబరీష్, ఎంవి.రమణ, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ వి.శ్రీలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, డిసిఒ శ్రీనివాస్, జిల్లా అధికారులు, రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

గణితం పరీక్షకు 13 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ముసునూరు, గోపవరం, చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మూడు సెంటర్లలో కలిపి 600 మంది విద్యార్థులకు 587 మంది హాజరవ్వగా 13 మంది గైర్హాజరయ్యారని ఎంఇఒ సుబ్బారావు తెలిపారు.

కలిదిండి :మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో జరిగిన గణిత శాస్త్రం పరీక్షకు 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తంగా 929 మంది విద్యార్థులకు 907 మంది హాజరయ్యారని ఎంఇఒ అల్లూరి రవిప్రకాష్ తెలిపారు.

ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి ప్రతాప్‌శివ కిషోర్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్‌పి స్వయంగా ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. వాటిపై సంబంధిత అధికారులకు ఫోన చేసి వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 36 ఫిర్యాదులు అందాయన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నెంబర్‌కి ఫోన్ చేసి వివరాలు తెలపాలని సూచించారు. దీనిపై కేసు నమోదు చేసిన సైబర్ పోలీసులు వెంటనే పోగొట్టుకున్న సొమ్మును వెనక్కి తెచ్చేందుకు కృషి చేస్తారని చెప్పారు. పరీక్షల సమయం కావడంతో ప్రతిఒక్కరూ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని లౌడ్ స్పీకర్లను వినియోగించరాదని సూచించారు ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్స్ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో గృహ వినియోగదారులకు, వర్తక వాణిజ్య సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న కారణంగా విద్యుత్ మీటర్ రీడర్స్ ఉపాధి కోల్పోతున్నారని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, విద్యుత్తు మీటర్ రీడర్స్ యూనియన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోశాధికారి కె.మల్లేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద మీటర్ రీడర్స్ సోమవారం ధర్నా చేసి జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా డాంగే, మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి కోల్పోతున్న విద్యుత్ మీటర్ రీడర్స్‌కు విద్యుత్ సంస్థలోనే విద్యార్హతలను బట్టి ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

మా సమస్యలు పరిష్కరించండి

ఎన్‌టిఆర్ వైద్య సేవ ఫీల్డ్ ఉద్యోగుల శాంతియుత నిరసన

ఏలూరు సిటీ :గత 17 ఏళ్లుగా క్యాడర్ అమలు జరగకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఎన్‌టిఆర్ వైద్య సేవ ఫీల్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ ఏలూరులోని సర్వజన ఆసుపత్రిలో సోమవారం శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ తరపున ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17, 24వ తేదీల్లో శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పటికైనా ట్రస్ట్ అధికారులు, ప్రభుత్వం వారు తమ సమస్యలను పరిష్కారం చూపాలని కోరారు. లేకుంటే ఈనెల 27వ తేదీన డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ ముట్టడి కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఫీల్డ్ సిబ్బంది అందరూ కలిసి చేయనున్నట్లు తెలిపారు.

క్షయ పట్ల అప్రమతత్త అవసరం

ప్రజాశక్తి - భీమడోలు

క్షయ వ్యాధిని ముందస్తుగా గుర్తించే పరికరాలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో జాగ్రత్త పడాలని, వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు కోరారు. భీమడోలు సిహెచ్‌సిలో ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ హాజరయ్యారు. ఆరోగ్య కేంద్రం టిబి నియంత్రణ పర్యవేక్షకులు తోట మనోజ్ కుమార్ పలు సూచనలు చేశారు. 15 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార బాస్కెట్లను ఎంఎల్ఎ అందించారు.

కొయ్యలగూడెం :ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బయ్యన్నగూడెం పిహెచ్‌సిలో సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వి.సత్యనారాయణ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, పిహెచ్ఎన్ శైలజ, సూపర్‌వైజర్లు చాన్ భాషా, మరియమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని నూజివీడు ఏరియా ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. టిబి క్లినిక్ వైద్యాధికారి డాక్టర్ దుర్గాభవాని అధ్యక్షతన వ్యాధి గురించి ఎన్‌టిఇపి తరపున అందుతున్న సేవలను వివరించారు. సూపరింటెండెంట్ డాక్టర్ సింగ్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. రోగులకు పోషకాహార బాస్కెట్లు అందించారు. ఏరియా ఆసుపత్రి వైద్యులు, ఈదర, సగ్గురు, గొల్లపలి, దిగవల్లి, కోనేరుపేట వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ :ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల వైద్య విద్యార్థులచే సోమవారం క్షయ వ్యాధిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఫ్లాష్ ఎంఓబి నిర్వహించినట్లు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సావిత్రి తెలిపారు. ముందుగా ర్యాలీని సావిత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పిఎం డిపార్ట్‌మెంట్ హెచ్‌ఒడి డాక్టర్ జి.గంగాభవాని మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పివి.రమణ, డాక్టర్ ఎస్.విజయమోహన్, పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆగిరిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి జె.జగన్మోహనరావు అన్నారు. ఆనంద మహిళా మండలి, ఆగిరిపల్లి పిహెచ్‌సి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఆనంద మహిళా మండలి అధ్యక్షురాలు టి.సంధ్యానాని, వైద్యాధికారి ఎస్‌కె.టీనా, ఎంపిహెచ్‌ఒ రత్నబాబు, రమణ మణి పాల్గొన్నారు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

తాటియాకులగూడెంలో బోస్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెంలో గంధం బోస్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో భార్య శాంతికుమారి, భార్య ప్రియుడైన అశ్వారావుపేట మండలం పేరాయిగూడెం గ్రామానికి చెందిన సొంగా గోపాలరావులను ప్రధాన సూత్రధారులని నిర్ధారించి వారిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరావు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... తాటియాకులగూడెం గ్రామానికి చెందిన గంధం బోస్ (35) ఉపాధి హామీ చట్టంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తూ అవినీతికి పాల్పడటంతో అతడిని ఉద్యోగం నుంచి తప్పించారు. అప్పటి నుంచి ఇంటి వద్దే ఉండేవాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. దీనికి తోడు జగదాంబ తిరునాళ్లలో ఆలయ కమిటీని ఉద్దేశించి గ్రూపుల్లో పోస్ట్ పెట్టడంతో ఆలయ కమిటీ ఛైర్మన్ చిర్రి వెంకటేశ్వరావు చంపేస్తా అని ఫోన్‌లో బోస్‌ను బెదిరించాడు. ఇదే అదునుగా చూసుకున్న భార్య ఎలాగైనా బోస్‌ను వదిలించుకుని ఆ నేరాన్ని చిర్రి వెంకటేశ్వరావు మీద నెట్టేయొచ్చని ప్లాన్ వేసి ఆమె ప్రియుడైన సొంగా గోపాలరావుకు విషయం చెప్పింది. అనుకున్న ప్లాన్ ప్రకారం 17వ తేదీ రాత్రి గంధం బోస్ నిద్రలో ఉండగా గోపాల్‌రావు రాడ్డుతో తలపై గట్టిగా రెండు దెబ్బలు కొట్టాడు. దీంతో బోస్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే ప్రియుడు రాడ్డు తీసుకెళ్లి చెరువులో పడేసి ఇంటికి వెళ్లిపోయాడు. తెల్లవారేసరికి భర్తను ఎవరో వచ్చి కొట్టేసి వెళ్లిపోయారని చెప్పింది. ఇది నిజమే అనుకున్న కుటుంబ సభ్యులు అతడిని పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి ఖమ్మంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల 18వ తేదీన మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు డాగ్ స్క్వాడ్ క్లూస్ టీమ్‌లతో ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తులో భాగంగా భార్య ప్రమేయం ఉందని అనుమానంతో భార్యకు సంబంధించిన కాల్ డేటా ఆధారంగా పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో భార్య, భార్య ప్రియుడు నేరాన్ని అంగీకరించారు. వీరిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు సిఐ తెలిపారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గత తొమ్మిది నెలల కాలంలో ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో పాటు, వాటి సేవలు త్వరితగతిన ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆయన సోమవారం భీమడోలు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భీమడోలు, గుండుగొలను లే అవుట్లతో పాటు గుండుగొలను - కొవ్వూరు పాత జాతీయ రహదారిని భీమడోలు గ్రామంతో అనుసంధానం చేసే గ్యాస్ కంపెనీ రోడ్డుకు ప్రారంభోత్సవం చేశారు. పొలసానిపల్లిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు.

ఆర్ఒ ప్లాంట్ నీళ్లు ఉచితం

పది లీటర్లు, 20 లీటర్లు వంతున ఆర్ఒ ప్లాంట్ నీళ్లు అందించినందుకు ప్లాంట్ నిర్వహణ, ఇతర ఖర్చుల కోసం కొంత మాత్రం మొత్తాలను వసూలు చేసుకోవాలని గ్రామపంచాయతీ సూచించింది. కాని ప్లాంట్ ఏర్పాటుకు తీవ్రంగా కృషి చేసిన గ్రామ సర్పంచి సొమ్ములు వసూలు చేయాలన్న సూచనలను తిరస్కరించారు. గ్రామస్తులందరికీ ఆర్ఒ ప్లాంట్ తాగునీటిని ఉచితంగా అందిస్తామని తెలిపారు. సర్పంచి నిర్ణయాన్ని ఎంఎల్ఎతో పాటు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, పలువురు గ్రామస్తులు అభినందించారు.

మహారాజశ్రీ తూ॥గో॥జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, రాజమండ్రి వారి కోర్టులో

I.A. 2658/23, O.S. 48/19

Between:
Nakkella Baburao
...Petitioner/ Plaintiff
AND
Kesavarapu Venkata Bhaskara Rama Rao and Others
...Respondents/ Defendants

To:
R-6: Kesavarapu Sitarama Lakshmi, W/o. late Ramakrishna Rao, D.no. 14-9-14, Narasapuram, W.G.Dt.,
R-7: Kesavarapu Jaya Abhinav, S/o. late Rama Krishna Rao, D.No. 14-9-14, Narasapuram, W.G.Dt.,
R-8: Kesavarapu Jhana Samhitha, D/o. late Rama Krishna Rao, D.No. 14-9-14, Narasapuram, W.G.Dt.,

పై నెంబరు పిటిషన్‌లో 6 టు 8 రెస్పాండెంట్లు అయిన మీకు నోటీసు నిమిత్తం **26-3-2025 కి వాయిదా అయివున్నది.** అందు విషయమై మీకు ఏమయినా ఆక్షేపణలు వున్నచో వాయిదా రోజున **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయి తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

మద్దూరి శివ సుబ్బారావు
మద్దూరి శివరామ శశిభూషణ్
వి.శ్రీనివాసరావు
పి.ఆర్.పి.యాదవ్
అడ్వకేట్లు, డో.నెం. 46-11-34
రాజమండ్రి దానవాయిపేట
15-3-2025 రాజమండ్రి-3

మహారాజశ్రీ తూ॥గో॥జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, రాజమండ్రి వారి కోర్టులో

I.A. 2657/23, O.S. 48/19

Between:
Nakkella Baburao
...Petitioner/ Plaintiff
AND
Kesavarapu Venkata Bhaskara Rama Rao and Others
...Respondents/ Defendants

To:
R-6: Kesavarapu Sitarama Lakshmi, W/o. late Ramakrishna Rao, D.no. 14-9-14, Narasapuram, W.G.Dt.,
R-7: Kesavarapu Jaya Abhinav, S/o. late Rama Krishna Rao, D.No. 14-9-14, Narasapuram, W.G.Dt.,
R-8: Kesavarapu Jhana Samhitha, D/o. late Rama Krishna Rao, D.No. 14-9-14, Narasapuram, W.G.Dt.,

పై నెంబరు పిటిషన్‌లో 6 టు 8 రెస్పాండెంట్లు అయిన మీకు నోటీసు నిమిత్తం **26-3-2025 కి వాయిదా అయివున్నది.** అందు విషయమై మీకు ఏమయినా ఆక్షేపణలు వున్నచో వాయిదా రోజున **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయి తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

మద్దూరి శివ సుబ్బారావు
మద్దూరి శివరామ శశిభూషణ్
వి.శ్రీనివాసరావు
పి.ఆర్.పి.యాదవ్
అడ్వకేట్లు, డో.నెం. 46-11-34
రాజమండ్రి దానవాయిపేట
15-3-2025 రాజమండ్రి-3

గ్రామపంచాయతీ కార్యాలయం, గూటాల, పోలవరం, ఏలూరు జిల్లా

బహిరంగ వేలం ప్రకటన

తేది.26-03-2025

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, గూటాల గ్రామ పంచాయితీ ఏరియాలో ఫెర్రీ పాట గూటాల నుండి వంగలపూడి వరకు లాంచీ నాడుపుకొనుటకు 2025-26 సం॥నకు తేది. 29-03-2025 శనివారం నాడు ఉదయం గం. 10.30 ని॥ల నుండి గూటాల గ్రామ పంచాయితీ ఆఫీసు వద్ద ఫెర్రీ పాట జరపబడును.

వ.నెం.	వివరములు	సాల్వేన్సీ 2025 సం॥ము	చెల్లించవలసిన ధరావత్తు
1	ఫెర్రీ	5,00,000	1,00,000/-

("పడవ లేదా లాంచీ లైసెన్సుదారులను పరిగణలోకి తీసుకొబడును, లైసెన్సు నకలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, వాహనం రిజిస్ట్రేషన్ నెం., నకలు ఇన్సూరెన్సు నకలు, రూలు పర్మీషన్ నకలు, సదరు వేలం పాటలో పాల్గొనదలచిన వారు ఈ నకళ్ళు జతపరచవలెను.")

సదరు వేలం పాటలో పాల్గొనదలచినవారు పాటకు ముందుగా 2025 సంవత్సరమునకు సాల్వేన్సీ మరియు ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవచ్చును.

పాట నియమ నిబంధనలకు కార్యాలయపు పనివేళల్లో పంచాయితీ కార్యదర్శి వారిని సంప్రదించవచ్చును.

సం/- **సిరిపురపు ప్రసాద్**
సర్పంచ్, గూటాల గ్రామపంచాయితీ
పోలవరం మండలం, ఏలూరు జిల్లా.

సం/- **తాతి విజయకుమారి**
గ్రామపంచాయితీ కార్యదర్శి, గూటాల
పోలవరం మండలం, ఏలూరు జిల్లా.

పరిమిత పంటతోనే రైతులకు ప్రయోజనం

కొయ్యలగూడెం :పరిమిత పంటతోనే వర్జీనియా పొగాకు రైతులకు లబ్ధి చేకూర్చగలమని, అపరిమిత సాగు అనర్థాలను కలగజేస్తుందని వర్జీనియా పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ అన్నారు. వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో ప్రారంభించిన కొనుగోళ్లను ఆమె సోమవారం పర్యవేక్షించారు. రైతులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో సాగుదారులు ఎదుర్కొంటున్న సాధక బాధలు తెలిసినవేనని, అయితే బోర్డు ఇచ్చిన పరిమితుల మేరకే సాగుబడి చేయాలనేది తమ అభిమతమని చెప్పారు. ముందుగా వర్జీనియా పొగాకు వేలం నిర్వహణాధికారిని గ్రేసీ మార్గరెట్ ఆధ్వర్యంలో కొనుగోళ్లను ఆమె ప్రారంభించారు. రైతు ప్రతినిధులు కాకర్ల నంది, తోటకూర శ్రీనివాస్, సర్పంచి తోటకూర పద్మావతి, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **PALAPARTHI VIJAYA LAKSHMI** W/o Palaparthi Samuel John, D.No. 3-126, Ambedkar Nagar, Rustumbada Rural, Narasapuram Mandal, W.G.Dt., I have changed my name from **VIJAYA LAKSHMI SAMUEL JOHN** (Old name) to **PALAPARTHI VIJAYA LAKSHMI** (New name) hence forth I am being called **PALAPARTHI VIJAYA LAKSHMI** W/o Palaparthi Samuel John for all purposes.

ప్రకటన

మహారాజశ్రీ రెంట్ కంట్రోలర్ అప్పిలేట్ ట్రిబ్యునల్ మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 1199/2024 in R.C.A.No. 1/2019

Between:
దుపగుంట్ల సతీష్ కుమార్ మరియొకరు ...పిటిషనర్లు
Vs
దుపగుంట్ల వెంకటేశ్వరరావు వగైరాలు ...రెస్పాండెంట్లు

ఈ నెంబరు దావాలో ఆరవ రెస్పాండెంట్ దుపగుంట్ల గురు ప్రసాద్, తండ్రి: వెంకటేశ్వరరావు, డోర్ నెం. 9-14-2, కృష్ణుడు చెరువు వద్ద, తాడేపల్లిగూడెం అనువారు పై నెంబరు పిటిషను లో కోర్టు ద్వారా ఎన్నిమార్లు నోటీసులు పంపినప్పటికీ తీసుకొననందున /evade చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు యీ ప్రకటన ఇవ్వడమైనది. కావున సదరు ఆరవ రెస్పాండెంట్ దుపగుంట్ల గురు ప్రసాద్ తండ్రి: వెంకటేశ్వరరావు, డోర్ నెం. 9-14-2, కృష్ణుడు చెరువు వద్ద, తాడేపల్లిగూడెం వారు **ది.04-04-2025వ తేదిన ఉదయం 10-30 ని॥లకు** పైన తెలిపిన కోర్టులో స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరయి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడునని తెలియ పరచడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ధూళిపాళ సూర్య రామారావు
తాడేపల్లిగూడెం పిటిషనర్లు తరపు న్యాయవాది
తేది:24-03-2025 తాడేపల్లిగూడెం

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 243/2021

బిట్వీన్:
బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, నరసాపురం
-వాది
అండ్
ముమ్మిడివరపు నరేష్ అండ్ అనదర్
ప్రతివాది -ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: ముమ్మిడివరపు నరేష్, S/o. నాగేశ్వరరావు, డోర్ నెం. 3-27, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 02-04-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 24-03-2025 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 295/2021

బిట్వీన్:
బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, నరసాపురం
-వాది
అండ్
సిర్రా వెంకటేష్ అండ్ అనదర్
ప్రతివాది -ప్రతివాదులు

సమన్స్ టు:
D-2: మొల్లుం రవికుమార్, S/o. సుబ్రహ్మణ్యం, డోర్ నెం. 24-2-1, శంభునిపేట, పాలకొల్లు-534260, ప॥గో॥జిల్లా.

మీరు వాది బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 02-04-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 24-03-2025 సెల్: 98662 59514